క్లుప్తంగా

పేర్నమిట్టలో కమిషనర్ ఆకస్మిక పర్యటన



పేర్నమిట్టలో పర్యటిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

సంతనూతలపాడు: మండలంలోని పేర్నమిట్టలో ఉన్న ఒంగోలు నగరపాలక సంస్థ పరిధిలోని 41, 42 డివిజన్లలో కమిషనర్ వెంకటేశ్వరరావు శుక్రవారం ఆకస్మికంగా పర్యటించారు. పోలేరమ్మ గుడి, ఎన్టీఆర్ కళా ప్రాంగణం, ముదిరాజ్‌పాలెం, ఎన్టీఆర్ కాలనీ, కమ్మ బజార్, ముదిరాజులు, ఓగిరాల శ్మశానాలు, తదితర వాడల్లో ప్రజలతో మాట్లాడి సమస్యలడిగి తెలుసుకున్నారు. రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, శ్మశానాలలో జంగిల్ క్లియరెన్స్, తదితర సమస్యలు పరిష్కరించనున్నట్టు కమిషనర్ తెలిపారు. శ్మశానానికి సంబంధించిన స్థలాన్ని పరిశీలించి ప్రజలకు ఉపయోగపడేలా తయారు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో నాయకులు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ రవాణాకు అడ్డేదీ..?

- కొత్తపట్నం మండలంలో యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా
- పట్టపగలే వందల ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్న వైనం
- పట్టించుకోని అధికారులు



సూరారెడ్డిపాలెం రైల్వే గేటు మీదుగా ఒంగోలుకు అక్రమంగా ట్రాక్టర్లో తరలిస్తున్న ఇసుక

కొత్తపట్నం:

మండలంలో ఇసుక అక్రమ రవాణాకు అడ్డూఅదుపూ లేకుండా పోయింది. అక్రమార్కులు పట్టపగలే ఇసుక దందాను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. అయినప్పటికీ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. అధికార పార్టీ ఒత్తిళ్లకు తలొగ్గడంతో పాటు అవినీతికి పాల్పడుతూ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎక్కువ శాతం ప్రభుత్వ భూముల్లోనే ఇసుక తవ్వి రవాణా చేస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. మండలంలోని మడనూరు, ఈతముక్కల, రాజుపాలెం, కొత్తపట్నం, పాదర్తి, మోటుమాల గ్రామాల్లో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు వందల ట్రాక్టర్ల ద్వారా మండలంలో ఇసుక తరలిస్తూ అమ్ముకుంటున్నారు. ఒంగోలు నగరానికి రాత్రి సమయాల్లోనూ ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలిస్తున్నారు. ఆదివారమైతే పట్టపగలే ఇసుకను అక్రమంగా తరలించి అమ్ముకుంటున్నారు. మండలంలో అధికారికంగా ఇసుక రీచ్‌లు లేకపోయినప్పటికీ అక్రమంగా తవ్వి రవాణా చేస్తున్నారు. ఇసుక తవ్వడం వలన భూగర్భ జలాలు తగ్గిపోయి భవిష్యత్‌లో తాగునీటి సమస్య తలెత్తే ముప్పు పొంచి ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. అయినప్పటికీ ఇసుక అక్రమ రవాణా ఆపేందుకు అధికారులు కనీస చర్యలు చేపట్టడం లేదు.

రైతులకు తీవ్ర నష్టం...

కొత్తపట్నం మండలంలో అక్రమంగా ఇసుక తవ్వి తరలించడం వలన రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. కొన్ని ప్రాంతాల్లో ఇసుక తవ్విన చోట నీరు ఉప్పగా మారుతోందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. పర్యావరణానికి కూడా ముప్పు పొంచి ఉందని అంటున్నారు. ఇసుక నేలల్లో మొక్కలు వేస్తే బతకడం లేదని చెబుతున్నారు. ఇసుక తీసిన చోట కొంత మంది పైర్లు ఎండిపోవడం, పొలం తీరు మారిపోవడం జరుగుతోందని అంటున్నారు. తీర ప్రాంతంలో ఇసుక క్వారీలు వద్దని గతంలో హైకోర్టు ఉత్తర్వులు కూడా ఇచ్చింది. అప్పటి నుంచి మండలంలో ఇసుక తవ్వకాలకు అనుమతులు లేవు. కానీ, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చాక అక్రమంగా ఇసుక తవ్వి తరలించి అమ్ముకుంటున్నారు. ఒంగోలు నగరానికి, చుట్టుపక్కల గ్రామాలకు నిత్యం వంద ట్రాక్టర్లతో అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు. ఇప్పటికైనా మైనింగ్, పోలీస్, రెవెన్యూ అధికారులు స్పందించి ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాకు అడ్డుకట్ట వేయాలని కొత్తపట్నం మండలంలోని గ్రామాల ప్రజలు, రైతులు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొత్తపట్నం: మండలంలోని ఈతముక్కల, బీరంగుంట సబ్‌స్టేషన్లకు మరమ్మతుల కారణంగా శనివారం మండలంలోని పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆ శాఖ ఏఈ పి.చంద్రకాంత్ తెలిపారు. ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలైన సంకువారిగుంట, బీరంగుంట, ఆలూరు, గాదెపాలెం గ్రామాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఆయా గ్రామాల విద్యుత్ వినియోగదారులు గమనించాలని ఏఈ కోరారు.

మద్దిపాడు మండలంలో...

మద్దిపాడు: మండలంలోని గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్, ఎస్ఈజెడ్, మద్దిపాడు, దొడ్డవరం గ్రామాల్లోని విద్యుత్ సబ్‌స్టేషన్ల మెయింటెనెన్స్, మరమ్మతుల నిమిత్తం మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ చెన్నారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సంతనూతలపాడు మండలంలో...

సంతనూతలపాడు: మండలంలోని చిలకపాడు, సంతనూతలపాడు విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో మండల ఇన్‌చార్జి ఏఈ టి.సంతోష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంతనూతలపాడు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పి.గుడిపాడు, సంతనూతలపాడు, కొనగానివారిపాలెం గ్రామాలతో పాటు చిలకపాడు సబ్‌స్టేషన్ పరిధిలో మద్దులూరు, వేములపాడు, చిలకపాడు, బొడ్డువారిపాలెం, గుమ్మలంపాడు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ వివరించారు. ఆయా గ్రామాల విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

ఒంగోలు నగరంలో...

ఒంగోలు సబర్బన్: నగరంలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ ఒంగోలు నగర డీఈఈ కేవీవీ పాండురంగారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలు విద్యుత్ సబ్‌స్టేషన్ డి-1 పరిధిలో శ్రీగిరి సబ్ స్టేషన్ నిర్వహణలో భాగంగా శ్రీగిరి, కోర్టు సెంటర్, రాజాపానగల్ రోడ్, ఖద్దరు ఆఫీస్ రోడ్, పోస్టాఫీస్, సాయిబాబా గుడి ఎదురు రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ మరమ్మతుల కారణంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. అదేవిధంగా విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మతుల కారణంగా ఇస్లాంపేట, గోపాల్ నగర్, బాపూజీ కాంప్లెక్స్, కొత్తపట్నం బస్టాండ్ రోడ్, ఓల్డ్ మార్కెట్, తదితర ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. ఒంగోలు నగరం విద్యుత్ సబ్ స్టేషన్ డి-3 సెక్షన్ పరిధిలో కర్నూలు రోడ్డు, ఎన్‌జీఓ కాలనీ, చంద్రయ్య నగర్, పాల బజార్, జయప్రకాష్ కాలనీ, నాగేంద్ర నగర్, వెంకటేశ్వరకాలనీ, వుడ్ కాంప్లెక్స్, ఆర్టీసీ బస్టాండ్, పేర్నమిట్ట, ఇండస్ట్రియల్ ఎస్టేట్, ప్రతిభ కాలేజీ, నిర్మలనగర్, బృందావన్‌నగర్, లంబాడీడొంక, అంజయ్య రోడ్డు, తదితర ప్రాంతాల్లోనూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

చెవిరెడ్డి, బూచేపల్లికి దుంపా కృతజ్ఞతలు



చెవిరెడ్డి భాస్కరరెడ్డి, బూచేపల్లి శివప్రసాదరెడ్డితో దుంపా రమణమ్మ, చెంచిరెడ్డి

సంతనూతలపాడు: వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాదరెడ్డిని శుక్రవారం ఆ పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు దుంపా రమణమ్మ మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలిగా తనను నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. తన నియామకం తర్వాత మొదటిసారి చెవిరెడ్డిని కలిసిన సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శాలువా కప్పి సత్కరించారు. తనపై నమ్మకం ఉంచి పార్టీ పదవి అప్పగించినందుకు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో మహిళలు చురుగ్గా పార్టీలో పనిచేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. ఆమె వెంట పార్టీ సంతనూతలపాడు మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, సొసైటీ మాజీ అధ్యక్షుడు దుంపా యలమందారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సహాయకులు రైతులకు అండగా నిలవాలి

సంతనూతలపాడు: మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో శుక్రవారం సంతనూతలపాడు మండల వ్యవసాయ అధికారిణి పి.పావని అధ్యక్షతన మండలంలోని గ్రామాల్లో పనిచేస్తున్న వ్యవసాయ సహాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారిణి పావని మాట్లాడుతూ ప్రస్తుతం సాగులో ఉన్న శనగ, పొగాకు, తదితర పంటలకు ఈ పంట నమోదు ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఈ పంట నమోదు చేసిన ఇన్సూరెన్స్ పంటలైన వరి, మినుము, శనగ తదితర పంటలకు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకుంటే ఇన్సూరెన్స్ వర్తిస్తుందని తెలిపారు. ఈకేవైసీ త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. రైతు సేవా కేంద్రాల పరిధిలోని రైతులందరికీ రైతు ధ్రువీకరణ పత్రాలు (ఫార్మర్ ఐడీలు) వచ్చేలా యాప్లో నమోదు చేయాలని తెలిపారు. అలాగే పీఎం కిసాన్ 19వ విడత నగదు త్వరలో రైతుల ఖాతాల్లో జమకానున్న నేపథ్యంలో రైతులకు పీఎం కిసాన్ సంబంధిత సమస్యలుంటే వెంటనే పరిష్కరించాలని తెలిపారు. గ్రామ వ్యవసాయ సహాయకులు రైతులకు అందుబాటులో ఉంటూ పంటల్లో యాజమాన్య పద్ధతులు, చీడపీడల నివారణ చర్యలను సకాలంలో తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి కె.వి.సుబ్బారెడ్డి, గ్రామాల వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుడి తల్లికి మేరుగు నాగార్జున పరామర్శ



లేయమ్మను పరామర్శిస్తున్న మేరుగు నాగార్జున

మద్దిపాడు: మండలంలోని బూరేపల్లి కాలనీకి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కావూరి ఏసోబు తల్లి కావూరి లేయమ్మ అనారోగ్యంతో బాధపడుతుండటంతో ఆ పార్టీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి మేరుగు నాగార్జున శుక్రవారం సాయంత్రం వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని ధైర్యంగా ఉండాలని చెప్పారు. ఆయన వెంట పార్టీ మద్దిపాడు మండల నాయకులు ఉన్నారు.

వధూవరులను ఆశీర్వదించిన బూచేపల్లి, మేరుగు



వధూవరులను ఆశీర్వదిస్తున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, మేరుగు నాగార్జున

మద్దిపాడు: మండలంలోని లింగంగుంట గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ అభిమాని కంకణాల సురేష్ వివాహానికి శుక్రవారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి మేరుగు నాగార్జున హాజరై వధూవరులను ఆశీర్వదించారు. వారి వెంట పార్టీ సంతనూతలపాడు మండల అధ్యక్షుడు దుంపా చెంచిరెడ్డి, జెడ్పీటీసీలు దుంపా రమణమ్మ, వేమా శ్రీనివాసరావు, నాయకులు వాకా కోటిరెడ్డి, తేళ్ల పుల్లారావు, గుడ్డపోతల రవి, కొమ్మూరి సుధాకర్, దుడ్డు వినోద్, అన్వేష్, సంధ్య, మహేష్, శ్రీకాంత్, బొమ్మల దేవదాసు, రామాంజనేయులు, తదితరులు పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.


రమాబాయికి ఘన నివాళి



రమాబాయికి నివాళులర్పిస్తున్న బీటీఏ నాయకులు

ఒంగోలు సిటీ: మాతా రమాబాయి అంబేడ్కర్ జయంతిని బహుజన టీచర్స్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా మండల విద్యాశాఖ అధికారుల సంఘ జిల్లా అధ్యక్షుడు బత్తుల నాగేంద్రవదన్ పాల్గొని మాట్లాడారు. మాతా రమాబాయి అంబేడ్కర్ త్యాగం మరువలేనిదని, దేశం కోసం తన నలుగురు బిడ్డలను త్యాగం చేసిన గొప్ప దేశభక్తురాలని కొనియాడారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పర్రె వెంకట్రావు, రాష్ట్ర నాయకులు పారాబత్తిన జాలరామయ్య, మద్దిరాల శరత్ చంద్రబాబు, జిల్లా నాయకులు కర్ర దేవా సహాయం, పల్లె కృష్ణమూర్తి, పావళ్ల రాచయ్య, పల్లె తిరుపతిస్వామి, కొండమూరు కొండల రాయుడు, చెక్క కోటేశ్వర రావు, బొంత కళ్యాణ్, మిరియాల విజయ్ కుమార్ తదితరులు పాల్గొని మాతా రమాబాయికి ఘనంగా నివాళులర్పించారు.

నేత్రపర్వంగా శ్రీవారి కల్యాణం



కల్యాణ వేదికపై ఉభయదేవేరులతో స్వామివారు

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణ శివారులోని జంకె రామిరెడ్డి నగర్‌లో కొలువై ఉన్న శ్రీలక్ష్మీ పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి 18వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఈ సందర్భంగా శుక్రవారం స్వామివారి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. వేద పండితులు ఉదయం 10 గంటలకు ప్రత్యేకంగా పూలతో అలంకరించిన మండపంలో ఉభయ దేవేరులతో కూడిన స్వామివారి ఉత్సవ మూర్తులను ప్రతిష్ఠించి కల్యాణ క్రతువును నిర్వహించారు. స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు. వివిధ రకాల డ్రైఫ్రూట్స్, పూలతో స్వామివారిని అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. వేలాది మంది భక్తులు హాజరై స్వామివారి కల్యాణోత్సవాన్ని తిలకించారు. అనంతరం భక్తులకు అన్న సంతర్పణ చేశారు. ఆలయ అధ్యక్ష కార్యదర్శులు చక్కా మాలకొండ నరసింహారావు, ఊటుకూరి రామకృష్ణతోపాటు పలువురు పట్టు వస్త్రాలు, ముత్యాలు సమర్పించారు. రాత్రి స్వామివారిని గరుడ వాహనంపై ఊరేగించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, పలు రకాల వేషధారణలు భక్తులను అలరించాయి. మార్కాపురం రూరల్ ఎస్సై అంకమరావు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు ఆర్‌కేజే నరసింహం, ఏరువ దేవిరెడ్డి తదితర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఓబీసీపై జంగిల్ క్లియరెన్స్ పనులు



జేసీబీతో చేస్తున్న జంగిల్ క్లియరెన్స్ పనులు

చీమకుర్తి: దాతల సహకారంతో నాగార్జునసాగర్ ఒంగోలు బ్రాంచ్ కెనాల్‌పై శుక్రవారం జంగిల్ క్లియరెన్స్ పనులు ప్రారంభించారు. స్థానిక కర్నూలు రోడ్డు నుంచి రామతీర్థం రిజర్వాయర్ వరకు సుమారు 5 కి.మీ పొడవున కాలువ కట్టకు ఇరువైపులా ఉన్న ముళ్లపొదలు, పిచ్చిమొక్కలను కృష్ణసాయి గ్రానైట్స్, నాల్‌సాఫ్ట్ ఆర్థిక సహకారంతో తొలగించారు. నీటి సంఘాల ప్రెసిడెంట్లు, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా క్విస్ ఫెస్ట్ ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న క్విస్ కాలేజీ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ గాయత్రి

ఒంగోలు సిటీ: స్థానిక క్విస్ ఇంజినీరింగ్ కళాశాలలో నేషనల్ లెవెల్ క్విస్ ఫెస్ట్ వేడుకలను శుక్రవారం ప్రారంభించారు. మూడు రోజుల పాటు జరగనున్న ఈ వేడుకలలో వివిధ రాష్ట్రాలకు చెందిన కాలేజీలు, యూనివర్సిటీల నుంచి 1200 మందికిపైగా విద్యార్థులు పాల్గొన్నారని క్విస్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ సూర్య కల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ డాక్టర్ గాయత్రి తెలిపారు. ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా శ్రీహరికోట సతీశ్ దావన్ స్పేస్ సెంటర్‌లో రేంజ్ ఆపరేషన్స్ డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న జి.గ్రహదొరై హాజరవగా, గౌరవాధ్యక్షునిగా డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి పాల్గొన్నారు. ముఖ్య అతిథి గ్రహదొరై మాట్లాడుతూ విద్యార్థులు గొప్పగా కలలు కనాలని, వాటిని సాకారం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఇస్రో గొప్పతనాన్ని వివరించారు. రాకెట్ పనితీరు, టెక్నాలజీ, తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. క్విస్ కాలేజీలో విద్యార్థులకు అద్భుతమైన అవకాశాలు ఉన్నాయని, సూర్యకల్యాణ్ చక్రవర్తి విజన్ అద్భుతంగా ఉందని కొనియాడారు. విద్యార్థులంతా ఉపయోగించుకోవాలని సూచించారు. ఫెస్ట్ ప్రారంభోత్సవం అనంతరం క్రీడా పోటీలను ప్రారంభించారు. గౌరవ వందనం స్వీకరించి క్రీడా జ్యోతి వెలిగించారు. కార్యక్రమంలో ఎస్ఎన్ఈఎస్ వైస్ ప్రెసిడెంట్ చెంచుప్రసాద్, క్విస్ కళాశాల డీపీఎస్ఆర్ డైరెక్టర్ డాక్టర్ సుబ్బారావు, క్విస్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీ హనుమంతరావు, ఫార్మసీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కిశోర్‌బాబు, క్విస్ ఫెస్ట్ కన్వీనర్ డాక్టర్ సమీర్, కో కన్వీనర్ డాక్టర్ మౌళీచంద్ర, హెచ్‌వోడీలు, డీన్‌లు, డైరెక్టర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంకేతిక ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు...

సస్టైనబులిటీ కాన్సెప్ట్‌తో రివైవ్, రీయూజ్, రీసైకిల్ థీమ్‌తో విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులు, పేపర్ ప్రజంటేషన్లు ఆకట్టుకున్నాయి. థీమ్ ఎక్స్ పోలో కొత్త కొత్త ప్రాజెక్టులతో విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మొదటి రోజు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. క్విస్ స్కూల్ విద్యార్థుల స్వాగత నృత్యం, సంక్రాంతిని గుర్తు చేస్తూ క్విస్ ఫార్మసీ విద్యార్థులు చేసిన థీమ్ నృత్యం ఆకట్టుకుంది. జాయ్ రైడ్స్, ఫుడ్ స్టాల్స్‌లో విద్యార్థులు ఉత్సాహంగా గడుపుతున్నారు. రెండో రోజు మ్యూజిక్ కాన్సర్ట్ జరగనున్నట్లు యాజమాన్యం వెల్లడించింది. బ్యాండ్ కాన్సర్ట్లో వారి మ్యూజికల్ నైట్‌లో సింగర్ సమీర భరద్వాజ్ పాల్గొననున్నారు.